క్లుప్తంగా

తల్లి పాలే బిడ్డకు శ్రేయస్కరం



నగరం: తల్లిపాలే బిడ్డకు శ్రేయస్కరమని కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ బాబురావు అన్నారు. తల్లి పాల వారోత్సవాలలో భాగంగా మండలంలోని మంత్రిపాలెం గ్రామంలో బుధవారం జరిగిన అవగాహన ర్యాలీలో సీహెచ్‌వో పాల్గొని మాట్లాడారు.తల్లి పాలలో వ్యాధినిరోధక శక్తి అధికంగా ఉంటుందన్నారు. పుట్టిన బిడ్డకు తల్లిపాలను తాగించాలన్నారు. తల్లి పాల ప్రాముఖ్యతను వివరించాల్సిన బాధ్యత అంగన్‌వాడీ,ఆశా కార్యకర్తలతో పాటు ఏఎన్‌ఎంలపై ఉందన్నారు.కార్యక్రమంలో అంగన్‌వాడీ,ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

వలంటీర్‌కు నియామక పత్రం అందజేత

నగరం: గ్రామ వలంటీర్ల ఖాళీలను ఎప్పటికప్పుడు భర్తీ చేస్తున్నట్లు ఎంపీపీ చింతల శ్రీకృష్ణయ్య చెప్పారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో బుధవారం పూడివాడ గ్రామానికి చెందిన మన్నెం భారతికి గ్రామ వలంటీర్ నియామకపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో చక్రపాణి ప్రసాద్ పాల్గొన్నారు.

6న ఉచిత వైద్య శిబిరం

భట్టిప్రోలు: భట్టిప్రోలు ఫ్రెండ్స్ అసోసియేషన్ (బీఎఫ్‌ఏ) ఆధ్వర్యంలో ఈ నెల 6న స్థానిక శ్రీ వేణుగోపాల స్వామి దేవస్థానంకు చెందిన సాయికృష్ణ కళా వేదిక ఆవరణలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పలువురు వైద్యులు పాల్గొని పరీక్షలు చేస్తారని పేర్కొన్నారు. ఉచితంగా మందులు అందజేయనున్నట్లు తెలిపారు.

అర్హతఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు

- ఎంపీ మోపిదేవి వెంకటరమణారావు
- దిండిలో గడప గడపకు మన ప్రభుత్వం

నిజాంపట్నం: అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందాలన్నదే జగనన్న లక్ష్యమని రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణారావు అన్నారు. మండలంలోని దిండి పంచాయతీ అడవల గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. దేశంలోనే ఏ రాష్ట్రంలో అమలు చేయని సంక్షేమ పథకాలను రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు పరిచి, అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా చూస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలో ఆర్థికంగా ఎన్ని ఇబ్బందులు ఉన్నప్పటికీ ఇచ్చిన మాటకు కట్టుబడి ప్రతి హామీని నెరవేర్చడం జరిగిందన్నారు. గత టీడీపీ ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి, రాష్ట్ర ప్రజలను తీవ్రంగా మోసం చేసిందని ఆయన విమర్శించారు. కానీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చి, ప్రజల హృదయాల్లో స్థానం సంపాదించారని కొనియాడారు. తాము అధికారంలోనికి వస్తే సంక్షేమ పథకాలు తీసివేస్తామంటున్న చంద్రబాబు నాయుడు కావాలా..? సంక్షేమ పథకాలు కొనసాగిస్తామంటున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కావాలా? అని మహిళలను ఎంపీ మోపిదేవి అడిగారు. మరోసారి జగనన్నను ముఖ్యమంత్రిని చేసుకునేందుకు సిద్ధంగా ఉన్నామని మహిళలు తెలిపారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలను ఎంపీ వివరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ యేమినేని రాంబాబు, ఎంపీపీ మోపిదేవి విజయనిర్మల, మాజీ జెడ్పీటీసీ ప్రసాదం వాసుదేవ, డీసీఎంఎస్ చైర్మన్ యార్లగడ్డ భాగ్యలక్ష్మి మదన్, పీతా సుధాకర్, నాజర్‌ఖాన్, ఎంపీటీసీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



దిండిలో మహిళకు సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎంపీ మోపిదేవి వెంకటరమణారావు

ఓటర్ల జాబితాలో తప్పొప్పులను సరిచేసుకోవాలి

రేపల్లె రూరల్: ప్రతి ఒక్కరూ ఓటర్ల జాబితాలో తమ పేర్లను పరిశీలించుకుని, తప్పొప్పులను సరిదిద్దుకోవాలని తహసీల్దారు మల్లికార్జునరావు చెప్పారు. మండలంలో జరుగుతున్న ఓటర్ల సర్వేను బుధవారం ఆయన నల్లూరుపాలెం, కమ్మవారిపాలెం గ్రామాలలో పరిశీలించి, మాట్లాడారు. బీఎల్వోలు ప్రతి గ్రామంలో ఇంటింటికి పర్యటించి ఓటర్లకు జాబితా చూపుతున్నారన్నారు. జాబితాలో పొరపాట్లు ఉంటే సరిచేసుకునేందుకు ఈ నెల 21వ తేదీ వరకు అవకాశం ఉందన్నారు. దీంతో పాటుగా 2024 జనవరి 1 నాటికి 18 సంవత్సరాలు నిండే వారి నుంచి ఓటు హక్కు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో రెండుచోట్ల ఓటు హక్కు కలిగిన వారు తప్పనిసరిగా ఒక చోట ఓటు హక్కును తొలగించుకోవాలన్నారు. మృతి చెందిన వారి వివరాలను బీఎల్వోలకు తెలియజేసి జాబితా నుంచి వారి పేర్ల తొలగింపునకు సహకరించాలని కోరారు. అలాగే మండలంలోని అరవపల్లిలో తహసీల్దారు మల్లికార్జునరావు అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. స్థానిక ప్రాథమిక పాఠశాలను సందర్శించి, మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. ఆయన వెంట బీఎల్వోలు, ఉపాధ్యాయులు ఉన్నారు.



కమ్మవారిపాలెంలో ఓటరు సర్వేను పరిశీలిస్తున్న తహసీల్దారు మల్లికార్జునరావు

మణిపూర్ అల్లర్లకు నిరసనగా శాంతి ర్యాలీ



కొల్లూరు : మణిపూర్‌లో చోటుచేసుకుంటున్న అల్లర్లు, కొన్ని వర్గాలపై దాడులకు నిరసనగా బుధవారం మండలంలోని క్రైస్తవ సమాఖ్య పాస్టర్స్ పెలోషిప్‌లు, క్రైస్తవ సంఘాల ఆధ్వర్యంలో స్థానిక గాంధీనగర్ ఆర్సీఎం చర్చి నుంచి జగనన్న కాలనీ వరకు ర్యాలీ నిర్వహించారు. మణిపూర్‌తో పాటు ఇతర రాష్ట్రాల్లో క్రైస్తవులు, చర్చిలపై జరుగుతున్న దాడులను అరికట్టి, అమాయకుల మాన, ప్రాణాలను కాపాడాలని డిమాండ్ చేశారు. అనంతరం కొల్లూరు రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దారు ఎ. శ్రీనివాసరావుకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పలు గ్రామాలకు చెందిన పాస్టర్లు, క్రైస్తవ సంఘాల నాయకులు పాల్గొన్నారు.